- యాసంగికి నీటి కొరత
- మిడ్ మానేరు, దిగువ మానేరులో ఉన్నవి 42 టీఎంసీలు
- ఇతర అవసరాలకు పోను 25 టీఎంసీలు వాడుకునే అవకాశం

# ఆరుతడికే నీళ్లు



దిగువ మానేరు జలాశయం

కరీంనగర్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎల్ఎండీ జలాశయం దిగువ ఆయకట్టుకు ఈసారి పూర్తి స్థాయిలో సాగు నీరు అందే అవకాశాలు కనిపించడం లేదు. ఎస్సారెస్పీలో ఉన్న నీరు ఎగువ ఆయకట్టుకే సరిపోయే పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. దిగువ ఆయకట్టు పరిధిలో ఎంత సాగు అవుతుంది? నీరు ఎంత అవసరం ఉంటుందనేది అధికారులు ఇప్పటికైతే ఒక అంచనాకు రాలేదు. ప్రస్తుతం శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్‌లో 23.17 టీఎంసీలు, దిగువ మానేరు జలాశయంలో 19.53 టీఎంసీలు కలిపితే 42 టీఎంసీల నీరు ఉన్నది. అందులో తాగునీరు, ఇతర అవసరాలకుపోను 25 టీఎంసీల వరకే దిగువ ఆయకట్టుకు ఇవ్వచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరుతడి పంటలకే సాగు నీరు అందించాలని సూచన ప్రాయంగా నిర్ణయించినట్లు తెలుస్తున్నది. ఈ నెల 13న హైదరాబాద్‌లో జరిగిన శివం సమావేశంలోనూ ఇదే విషయమై చర్చించినట్లు సమాచారం.

### ఆరుతడికైతే ఎక్కువ ఆయకట్టుకు..

ఎస్సారెస్పీ పరిధిలోని దిగువ మానేరు జలాశయం స్టేజ్ -1లో కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలో 5,05,720 ఎకరాలు, స్టేజ్-2లో ఖమ్మం, నల్లగొండ జిల్లాల పరిధిలో మరో 3.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఇప్పుడు స్టేజ్-1 పరిధి వరకు నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే, ఇందులో ఆరుతడి పంటలకైతే 5 లక్షల ఎకరాల వరకు, తరి పంటలకైతే 3 లక్షల ఎకరాల వరకే సరిపడా నీరు అందుబాటులో ఉన్నదని అధికారులు చెబుతున్నారు. ఎస్సారార్, ఎల్ఎండీ జలాశయాల నుంచి 25 టీఎంసీలు మాత్రమే సాగు నీటికి వాడుకునే వీలుండడంతో ఆరుతడి పంటల సాగుకే రైతులు మొగ్గు చూపాలని సూచిస్తున్నారు.

### త్వరలో జిల్లా స్థాయి సమావేశం

యాసంగిలో సాగునీటి విడుదల ఎప్పుడనేది త్వరలో జిల్లా స్థాయిలో సమావేశం నిర్వహించి నిర్ణయిస్తామని ఎస్సారెస్పీ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ఎస్సారెస్పీ పరిధిలోని సాగు నీటిని సరఫరా చేయాలని నిర్ణయం తీసుకున్న నీరుపారుదల శాఖ ఉన్నతాధికారులు తిరిగి జిల్లాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో సమావేశాలు నిర్వహించుకుని నీటిని ఎప్పుడు విడుదల చేసేది నిర్ణయించుకోవాలని సూచించినట్లు తెలుస్తున్నది. ఈ మేరకు మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అనుమతితో మూడు నాలుగు రోజుల్లో సమావేశం నిర్వహించి నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. జనవరి మొదటి వారంలోనే నీటి విడుదల ఉండే అవకాశమున్నది.

### ఆరుతడికే ప్రాధాన్యత

ప్రాజెక్టుల్లో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని ఆరుతడికే ప్రాధాన్యత ఇస్తాం. ఈ నిర్ణయానికి రైతులు కూడా సహకరించాలి. ప్రాజెక్టుల్లో ఉన్న నీటి లభ్యత, ఇప్పుడున్న పరిస్థితుల గురించి శివం సమావేశంలో చర్చించాం. ఈ మేరకు జిల్లా స్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటాం. నీరు ఎప్పుడు విడుదల చేయాలనేది కూడా అప్పుడే నిర్ణయిస్తాం.

\- శంకర్, ఎస్సారెస్పీ చీఫ్

# వేములవాడకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృత్యువాత
- మరొకరి పరిస్థితి విషమం
- తెల్లవారుజామున తాడికల్‌లో ఘటన
- ఎదురెదురుగా ఢీకొన్న లారీ, కారు
- మృతులు జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లావాసులు



శ్రావణ్ (ఫైల్)



ఆకాశ్ (ఫైల్)

శంకరపట్నం, డిసెంబర్ 16 : శంకరపట్నం మండలం తాడికల్ మూల మలుపు వద్ద శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు-లారీ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారులోని ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా టేకుమట్ల మండలం ఎంపెడు గ్రామానికి చెందిన మ్యాదగోని శ్రావణ్ (30) తన భార్య, కొడుకుతో కలిసి హనుమకొండలో నివసిస్తున్నాడు. ట్యాక్సీ నడుపుకొని జీవిస్తున్నాడు. శుక్రవారం హైదరాబాద్ నుంచి యాత్రికులను తన కారులో వేములవాడ రాజన్న సన్నిధికి తీసుకెళ్లాడు. శనివారం కొండగట్టుకు తీసుకెళ్లాల్సి ఉన్నది. అయితే యాత్రికులు రాత్రి వేములవాడలో బస చేయగా, శ్రావణ్ అదే రాత్రి హనుమకొండకు వచ్చాడు. అదే హనుమకొండలో ఉంటూ డిగ్రీ చేస్తున్న పెద్దపల్లికి చెందిన తన బావమరిది బొల్లికొండ ఆకాశ్ (22), వారి స్నేహితుడు పైడిపెల్లి రాకేశ్ (స్వగ్రామం పెద్దపల్లి)తో కలిసి శనివారం తెల్లవారుజామున 2గంటల సమయంలో తన కారులో వేములవాడకు వెళ్తున్నాడు. 2.30 గంటల తర్వాత మార్గమధ్యలో శంకరపట్నం మండలంలోని తాడికల్ మూలమలుపు వద్దకు రాగానే.. వీరి కారును కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వస్తున్న లారీ ఢీకొంది. దీంతో కారులో ఉన్న శ్రావణ్, ఆకాశ్ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి చేరుకున్న కేశవపట్నం ఎస్ఐ లక్ష్మారెడ్డి, సిబ్బందితో కలిసి కారులో ఇరుక్కు పోయిన మృతదేహాలను బయటకు తీసి హుజూరాబాద్ మార్చురీకి తరలించారు. తీవ్ర గాయాలపాలైన రాకేశ్‌ను 108లో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఆకాశ్ తండ్రి బొల్లికొండ రాజయ్య ఫిర్యాదు మేరకు భీమవరం జిల్లా నర్సాపూర్ మండలం మల్లవరం పెద్దలంకకు చెందిన లారీ డ్రైవర్ పాలపర్తి గంగాధర్‌రావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



సమావేశమైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

# పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం

కోర్టుచౌరస్తా, డిసెంబర్ 16: తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్త పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాసిక్యూటర్ల సమస్యలు, సందేహాలపై చర్చించారు. ఎక్కువ కేసుల్లో శిక్షలు పడేలా కృషి చేసిన ప్రాసిక్యూటర్లను వెంకటేశ్వర్లు అభినందించారు. క్రిమినల్ కేసులు విచారణకు వచ్చే ముందు ప్రాసిక్యూటర్లు వాటిపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, వాటిలో నిందితులకు శిక్షలు పడేలా దృష్టి సారించాలని ఆయన ఈ సందర్భంగా ప్రాసిక్యూటర్లకు సూచించారు. అనంతరం ఏపీపీ సతీశ్ కుమార్ పబ్లిక్ ప్రాపర్టీ రక్షణ చట్టం (పీడీపీపీ )గురించి వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్, స్పెషల్ పీపీ బాల త్రిపుర సుందరి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, తుమికి పవన్ కుమార్, ఆరెల్లి రాములు, జూలూరి శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, కాసారం మల్లేశం, పెంట శ్రీనివాస్, శరత్, వేముల లక్ష్మీప్రసాద్, జ్యోతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీధర్, ఇతర అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

# విధులు గౌరవం పెంచేలా నిర్వర్తించాలి



శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, డిసెంబర్ 16: ప్రభుత్వోద్యోగుల విధులు వారి పట్ల గౌరవం పెంచేలా నిర్వర్తించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. జూనియర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా శిక్షణ కేంద్రంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, మారుతున్న కాలంలో పుస్తకం, పెన్ను వంటివి ఉద్యోగులకు దూరమవుతున్నాయని, ప్రతి ఒక్కరూ నిత్య విధుల్లో భాగంగా వారికి ఎదురయ్యే సమస్యలు, ఇతర విషయాలు, సంఘటనలను సత్వరమే కాగితంపై రాసుకోవడం ద్వారా ఆవిషయం ఎక్కువ కాలం గుర్తుంటుందన్నారు. దీని ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు త్వరగా అర్థం చేసుకుని సునాయసంగా పరిష్కరించగలుగుతామన్నారు. విధి నిర్వహణలో భాగంగా ఏదైనా పనిని పూర్తిచేయాలంటే దాని కోసం ఎక్కువ సమయం కార్యాలయంలో కేటాయించడం కాదని, పనిపై స్పష్టత కలిగి ఉండి, చిత్తశుద్ధితో సీరియస్‌గా పనిచేస్తే తక్కువ సమయంలోనే పూర్తి చేయగలుగుతామన్నారు. ప్రతి ఒక్కరూ కచ్చితమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి పనిచేయాలని ఉద్బోధించారు. ప్రతి ఉద్యోగి ఇతరులకు గౌరవాన్ని ఇస్తూ, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, విధులు నిర్వహించినప్పుడే నాయకత్వం వహించగలుగుతారని అన్నారు. పని పూర్తి చేయడంలో ఇతరులు ఆదర్శంగా తీసుకునేలా, విధుల పట్ల మిగతా ఉద్యోగులు ప్రేరేపితులయ్యేలా వ్యవహరించాలని హితవు పలికారు. సందర్భోచితంగా వ్యవహరిస్తూ నిత్య జీవితంలో విధుల పట్ల ఎదురయ్యే సమస్యలు పరిష్కరించి, ఉన్నతంగా నిలువాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణ కేంద్రం అధికారి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

ముకరంపుర, డిసెంబర్ 16: బాస్కెట్ బాల్ క్రీడాకారుడు విజయ్ స్మారకార్థం ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ మైదానంలో తోటి క్రీడాకారులు నిర్వహిస్తున్న విజయ్ స్మారక బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌ను శనివారం ఎస్ఈ వీ గంగాధర్ ప్రారంభించారు. పోటీలో 12టీములు పాల్గొన్నాయి. కార్యక్రమం లో సీనియర్ ప్లేయర్స్, విద్యుత్ అధికారులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.



జ్ఞాపిక అందజేస్తున్న ఎస్ఈ గంగాధర్

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

PLOT FOR SALE



★Residential Plot 2250 Sq. yards for Sale in Prime Residential Area at Near SRR College, Jagityal Road, Karimnagar Town. Ph: 9703544199.
NT-313050

REAL ESTATE

★రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టడం ద్వారా ప్రతిరోజు ఆదాయం పొందే అవకాశం. యాదగిరిగుట్టలో లగ్జరీ సూట్ ప్లాట్స్ కేవలం 26 లక్షలకే లాంచింగ్ ఆఫర్లో కలవు. సంప్ర॥ సెల్: 9381128358
NTK-316690

SCHOOL BUILDING SALE



★Running School Building for Sale in Armoor, District: Nizamabad, TS. Total Area 1600 Sq.yds., Total Slab Plinth Area 21000 Sft. Call: 7989918123.
NT-313178-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194